www.nagaranijam.com
PRGI/RNI NO : APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు :
☎ 82474 67562
Email Id : nagaranijam@gmail.com

# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక



| సంపుటి : 14 | సంచిక : 88 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 20,శనివారం,జూన్, 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 88 | Rangareddy | Editor : Aela.Purushotham | 20,Saturday,June,2026 | Pages : 4+ | Price : 3/- |

Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

# విద్యార్థుల నైపుణ్య వికాసమే లక్ష్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 19, (నగర నిజం) : విద్యార్థినీ విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసి వారిని సమాజంలో గొప్ప పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని విద్యా కేంద్రంగా, క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు విద్యార్థి కిట్ల పంపిణీతో పాటు విద్యా రంగానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని 27.50 లక్షల మంది విద్యార్థులకు యంగ్ ఇండియా విద్యార్థి కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. ప్రస్తుతం పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రపు చిరుతిండి అందిస్తున్నామని, భవిష్యత్తులో రవాణా సౌకర్యం కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. విద్యా రంగ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ. 26,600 కోట్ల నిధులు కేటాయించామని, దీనిని ఖర్చుగా కాకుండా భవిష్యత్తుకు పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించినట్లు చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు స్పష్టమైన విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ పాఠశాలను అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం డిమాండ్ పెరగడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని కొనియాడారు. తెలంగాణను విద్యా రంగంలో దేశానికి ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దళిత బిడ్డల నుంచి వందలాది అంబేద్కర్లు రావాలని ఆకాంక్షించారు. అందరి తలరాతను మార్చేది విద్య మాత్రమేనని, చదువుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే "అన్న-అక్క మెంటార్షిప్" కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. చదువులో ప్రతిభ కనబరిచిన







విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహమ్మద్ అజారుద్దీన్, సలహాదారు కె. కేశవరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వేలాదిమంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థుల ప్రతిజ్ఞ




హైదరాబాద్, జూన్ 19, (నగర నిజం) :మాదక ద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టి యువతను సురక్షిత భవిష్యత్తు వైపు నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ శనివారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థినీ, విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, సలహాదారు కె. కేశవరావు తదితర ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు "మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వాములమవుతామని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఇతరులను కూడా వాటి బారిన పడకుండా కాపాడేందుకు కృషి చేస్తామని, మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంకల్పంలో భాగస్వాములమవుతామని" ప్రతిజ్ఞ చేశారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించాలని కార్యక్రమంలో పలువురు నాయకులు పిలుపునిచ్చారు. సమాజంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.








# నీట్ రీ-ఎగ్జామ్ అభ్యర్థులకు టీజీఎస్ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం

హైదరాబాద్, జూన్ 19, (నగర నిజం) : నీట్ రీ-ఎగ్జామ్‌కు హాజరయ్యే అభ్యర్థులకు టీజీఎస్ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 21న దేశవ్యాప్తంగా జరిగే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్ చూపించి ఇంటి నుంచి పరీక్షా కేంద్రానికి, తిరిగి ఇంటికి ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. ఏసీ సర్వీసులు మినహా టీజీఎస్ఆర్టీసీకి చెందిన అన్ని బస్సుల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. పరీక్షకు దాదాపు 73 వేల మంది అభ్యర్థులు హాజరవుతున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల మార్గాల్లో తగినన్ని బస్సులను నడిపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 21న తొలి సర్వీసు నుంచి అర్ధరాత్రి వరకు ఉచిత ప్రయాణ సదుపాయం అమల్లో ఉంటుందని చెప్పారు. ప్రయాణ సమయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-23450033, 68153333లను సంప్రదించాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ముందస్తుగా ప్రయాణ ప్రణాళిక సిద్ధం చేసుకుని సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించిన నాగిరెడ్డి, అన్ని అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి: ప్రధాన ఎన్నికల అధికారి

హైదరాబాద్, జూన్ 19, (నగర నిజం) :భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానుందని, ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ సన్నాహక చర్యలపై శుక్రవారం అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి వీడియో సమావేశం నిర్వహించిన ఆయన, క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, స్వచ్ఛంద కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వారానికి కనీసం ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. గణన ఫారాల నింపడం, పంపిణీ, సేకరణ, సమాచారాన్ని అంతర్జాల వ్యవస్థలో నమోదు చేయడం వంటి అంశాలపై బూత్ స్థాయి అధికారులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. తరచుగా అడిగే ప్రశ్నలు, కరపత్రాలు, స్థానిక అవగాహన కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. పారదర్శకతను నిర్ధారించేందుకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, రాజకీయ పార్టీలు, గ్రామ పంచాయతీలు, ఇతర భాగస్వామ్య వర్గాలను కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేసి నాణ్యమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. ఈ వీడియో సమావేశంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, ఉప ప్రధాన ఎన్నికల అధికారి, నోడల్ అధికారులు, సమాచార సాంకేతిక విభాగ ప్రాజెక్టు మేనేజర్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



## CHANGE OF NAME

*I,MY SON's NAME WAS WRONGLY OCCURRED IN AADHAAR As AGULLA PRANID. S/o. AGULLA SHIVA SHEKHAR.R/O.PLOT NO-33, RAAVI NARAYANA REDDY COLONY ,KUNTLOOR,ABDULLAPURMET MANDAL, RANGAREDDY DISTRICT, TELANGANA -501505. Changed My Name (FROM) AGULLA PRANID.S/o. AGULLA SHIVA SHEKHAR.(To). **AGULLA PRANEETH. S/o.AGULLA SHIVA SHEKHAR.**

NN AD -20/06/2026

నగరనిజం

20 శనివారం, జూన్ 2026

# రాములమ్మ ఢిల్లీ టూర్ ఫలించేనా ?..

**హైద్రాబాద్ జూన్ 19;** తెలంగాణ కాంగ్రెస్ హై రాజకీయాల్లో ఇప్పుడు 'రాములమ్మ' (విజయ శాంతి) పెరు హాట్ టాపిక్ గా మారింది. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పదవిపై ఆమె అసంతృప్తిగా ఉన్నారా? అంటే అవుననే అంటున్నాయి గాంధీ భవన్ వర్గాలు. ఎన్నికల ముందు కాంగ్రెస్ గూటికి చేరిన సీనియర్ నేత, సినీ నటి విజయశాంతి.. ప్రస్తుతం పార్టీ వ్యవహారాలకు కాస్త దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తోంది. పదవులు ఉన్నా లేకపోయినా తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించే విజయశాంతి, ఇప్పుడు కాంగ్రెస్ తీరుపై కొంత అసహనంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అసంతృప్తి కారణంగానే విజయశాంతి పార్టీ అధికారిక కార్యక్రమాలకు పెద్దగా హాజరుకావడం లేదని తెలుస్తోంది. ఇటీవల ఆమెకు కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టింది. అసలు సీనియర్ల దక్కించుకోవడం అప్పట్లో పెద్ద సంచలనమే సృష్టించింది. అయితే, ఈ ఎమ్మెల్సీ పదవిపై రాములమ్మ అస్సలు హ్యాపీగా లేరన్నది ఇన్సైడ్ టాక్. తన సీనియారిటీకి, ఇమేజ్కు కేవలం శాసన మండలి సభ్యురాలిగా ఉండటం సరిపోదని, తన అసలు రేంజ్ మంత్రి పదవి అని ఆమె భావిస్తున్నట్లు సమాచారం.



కేవలం శాసనమండలి సమావేశాలకు మాత్రమే వస్తూ, అదీ మొక్కుబడిగా ప్రశ్నలు వేసి వెళ్ళిపోతున్నారని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. పైగా, మొన్నటి మొన్న జరిగిన మండలి సమావేశాల్లో సొంత ప్రభుత్వంపైనే ఆమె కొన్ని ఘాటు వ్యాఖ్యలు చేయడం, పరోక్షంగా తన అక్కసును వెళ్లగక్కడం కాంగ్రెస్ శ్రేణులను విస్మయానికి గురిచేసింది.

ఈ పరిణామాలు చూస్తుంటే రాములమ్మ కాంగ్రెస్కు ఏదో ఒక గట్టి అల్టిమేటం ఇవ్వబోతున్నారా అనే అనుమానాలు రాష్ట్రంలో త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో, విజయశాంతి తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇక్కడి స్థానిక నేతలతో సంబంధం లేకుండా, నేరుగా హైకమాండ్ను ఢిల్లీలో కలవాలని ఆమె డిసైడ్ అయినట్లు టాక్. ఇప్పటికే మంత్రి పదవుల కోసం పలువురు ఎమ్మెల్యేలు రాహుల్ గాంధీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా, రాములమ్మ మాత్రం ఒక పక్కా ప్లాన్తో హస్తిన బాట పడుతున్నారట. తనకు కనుక మంత్రి పదవి ఇస్తే.. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ మైలేజ్కు ఎలాంటి వ్యూహాలతో ముందుకెళ్తానో వివరించడానికి విజయశాంతి ఒక ప్రత్యేక బ్లూ ప్రింట్ కూడా సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. కాగా, గతంలో ఎవరూ ఊహించని విధంగా ఎమ్మెల్సీ పదవిని సొంతం చేసుకున్న రాములమ్మ. అదే జోష్తో ఇప్పుడు మంత్రి పదవిని కూడా సాధించుకుంటే ఆశ్చర్యపోనక్కర్లేదని సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. మరి ఢిల్లీ పెద్దలు రాములమ్మ డిమాండ్కు తలొగ్గుతారా? లేదా అనేది రానున్న రోజుల్లో చూడాలి.

# నేరాల నివారణకు నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలి





- **ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి**
- **మంచాల పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ**

**ఇబ్రహీంపట్నం, జూన్ 19 ( నగరనిజం ) :** నేరాల నివారణకు నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి, ఐపీఎస్ శుక్రవారం మంచాల్ పోలీస్ స్టేషన్ను సందర్శించి, స్టేషన్ పరిపాలన మరియు విధుల నిర్వహణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని రికార్డులు, ప్రజల ఫిర్యాదుల పరిష్కార విధానం, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ చర్యలు, స్టేషన్ పరిపాలనా వ్యవస్థ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై వారి విధి నిర్వహణను అభినందిస్తూ, మరింత సమర్థవంతంగా సేవలందించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, బాధ్యతాయుతమైన మరియు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడం ప్రతి పోలీసు అధికారి కర్తవ్యమని కమిషనర్ పేర్కొన్నారు. ఫిర్యాదులను సత్వరమే నమోదు చేసి పరిష్కరించడం, కమ్యూనిటీ పోలీసింగ్ను మరింత బలోపేతం చేయడం, నేరాల నివారణ మరియు గుర్తింపులో అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, సమర్థవంతంగా పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తిపరమైన ప్రమాణాలను పాటించాలన్నారు. బీట్ పోలీసింగ్ మరియు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలన్నారు. నేరాల నివారణకు నిఘా వ్యవస్థను పటిష్టం చేసి, ముందస్తు చర్యలు చేపట్టాన్నారు. స్టేషన్ రికార్డులు, డాక్యుమెంటేషన్ మరియు పరిపాలనా వ్యవస్థను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందిస్తూ, అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించాలన్నారు. తనిఖీ కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం డివిజన్ ఏసీపీ కెపివి.రాజు, పాల్గొని, పోలీస్ కమిషనర్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ తనిఖీ ద్వారా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన మరియు ప్రజా కేంద్రిత పోలీసింగ్ సేవలను అందించాలనే తన నిబద్ధతను మరోసారి చాటిచెప్పింది. సీపీ వెంట మంచాల సీఐ మధు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.

# 'మంచి ఆరోగ్యం, దీర్ఘాయువు కలగాలి'

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేవుడు ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షించారు. శుక్రవారం రాహుల్ గాంధీ 56వ పుట్టినరోజు జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా 'ఎక్స్'లో ప్రత్యేక సందేశం పోస్టు చేశారు. "లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు. ఆయన మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రార్థిస్తున్నాను" అని మోదీ పేర్కొన్నారు. రాజకీయంగా తీవ్ర విభేదాలు ఉన్నప్పటికీ రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం. 1970 జూన్ 19న జన్మించిన రాహుల్ గాంధీ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ దంపతుల కుమారుడు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2004లో అమేథీ నుంచి తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తర్వాత



కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు చేపట్టారు. 2013లో పార్టీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. 2017లో కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆ పదవికి రాజీనామా చేశారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ మీద రాజకీయాలు చేయడం సిగ్గుచేటు

- **ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు**
- **కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం, జూన్ 19 ( నగరనిజం ) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ మీద రాజకీయాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తే, అభినందించాల్సింది పోయి, బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పబ్లిక్ స్కూల్ పై ఎలాంటి అనుమానాలు ఉన్న పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయ బృందం ద్వారా వాస్తవాలు తెలుసుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ విద్యను ఉద్దేశపూర్వకంగా విధ్వంసం చేశారని, నేడు కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వికాసం వైపు అడుగులు వేస్తున్నారని చెప్పారు. గత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సీఎం రేవంత్ గ్రామ సర్పంచ్ కి మెమొరాండం ఇవ్వడానికి అవకాశం కల్పించలేదని అనడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామానికి సరిపడ నీళ్లు రావడం లేదని అనడం నిజంగా హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తే, ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామానికి రూ.4 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారని చెప్పారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎమ్మెల్యే తన వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కనీసం సర్పంచులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. మరోసారి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని, అభివృద్ధిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో సహకార సంఘం చైర్మన్ హనుమంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతీరి ఏల్లేష్, మాజీ ఎంపీటీసీ కావాలి శ్రీనివాస్, మాజీ కో అప్షన్ సభ్యులు ఎండీ సలాం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సికిందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు పరమేశ్, సీనియర్ నాయకులు మార సురేష్, చంద్రయ్య, జంగయ్య గౌడ్, ఆరుట్ల గ్రామ శాఖ అధ్యక్షులు నూకం బాలరాజ్, చింధం శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ రీ-ఎగ్జామ్‌కు లైన్ క్లియర్

- **పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు**



**న్యూ ఢిల్లి జూన్ 19 ;** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ రీ ఎగ్జామ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఈ పరీక్షను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. జూన్ 21న జరగబోయే రీ ఎగ్జామ్ యథాతథంగా కొనసాగుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇటీవల పరీక్ష నిలిపివేయాలంటూ కొందరు విద్యార్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. పిటిషన్లను అత్యవసరంగా విచారణ జరపాలంటూ అభ్యర్థుల తరపు న్యాయవాది కోరగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసం దాన్ని తోసిపుచ్చింది. నీట్‌కు సంబంధించిన అన్నీ పిటిషన్లు జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ముందుకు వెళ్లాయని వీటిని కూడా ఆ ధర్మాసనమే విచారిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు వేసిన పిటిషన్లలో అత్యవసర పరిస్థితి లేదని ఆయన తేల్చిచెప్పారు. పేపర్ లీకేజీ, అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో సమస్యలు ఉన్నాయన్న పిటిషన్లను ఈ మేరకు సుప్రీంకోర్టు

# బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ అనుమతి మంజూరు

- **83 ఎకరాల భూమిని కేటాయింపు**

**న్యూ ఢిల్లి జూన్19;**బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ సంబంధించి 83 ఎకరాల భూమిని మంజూరు చేసింది. 83 ఎకరాల రక్షణ శాఖకు సంబంధించిన భూముల్లో మూసీ ప్రాజెక్టుకు అనుమతిచ్చింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధిలోని రూ.533 కోట్ల విలువైన భూముల బదలాయింపునకు ఓకే చెప్పింది. అయితే మరోచోట రూ.533 కోట్ల విలువైన భూములు ఇవ్వాలని ప్రభుత్వానికి షరతు విధించింది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారత ఆర్మీకి ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భూముల బదలాయింపు కీలక మైలు రాయి అని అభివర్ణించారు.


### ముమ్మరంగా భూసేకరణ ప్రక్రియ


మూసీ, ఈసీ నదుల సంగమ స్థలిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనుంది. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు అక్కడున్న రక్షణ భూములు ఇవ్వాలని



కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్దిరోజుల క్రితం విజ్ఞప్తి చేశారు. మూసీ, ఈసీ నదుల సంగమ స్థలిలో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం చేపడుతున్నామని ఆయనకు వివరించారు. అందుకోసం అక్కడున్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కొద్దిరోజుల క్రితం కోరారు. జాతీయ సమైక్యత, గాంధీ విలువలకు సంకేతంగా చేపడుతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ పరంగా చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో మహాత్ముడి సిద్ధాంతాలను ప్రచారం చేసే విజ్ఞాన కేంద్రం, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ఘాట్లు, శాంతి విగ్రహం, మ్యూజియం నిర్మించనున్నారు. ఇందుకు రక్షణ శాఖ భూములు కూడా అవసరమైనందు వల్ల కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. తాజాగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ అనుమతి మంజూరు చేయడంతో పనులు ముందుకు సాగనున్నాయ. మరోవైపు ఈ ప్రాజెక్టు కోసం భూ సేకరణ ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు భూసేకరణ ప్రక్రియ ముమ్మరం - 4 డిమాండ్లతో భూములిచ్చేందుకు రైతుల అంగీకారం

# ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పీర్జాదిగూడ, మేడిపల్లి ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు





**మేడిపల్లి :జూన్ 19(నగర నిజం ):**ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్-మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షులు శ్రీ తోటకూరి వజ్రేష్ యాదవ్ గారు హాజరై రాహుల్ గాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మాజీ మేయర్ శ్రీ అమర్ సింగ్ గారు, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీ కుర్ర శివకుమార్ గౌడ్ గారు, మాజీ అధ్యక్షులు శ్రీ తుంగతుర్తి రవి గారు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ శ్రీ అమర్ సింగ్ గారు మాట్లాడుతూ, "ప్రజల సంక్షేమం, రాజ్యాంగ పరిరక్షణ మరియు సామాజిక న్యాయం కోసం శ్రీ రాహుల్ గాంధీ గారు చేస్తున్న పోరాటం దేశ యువతకు స్ఫూర్తిదాయకం. ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు" అని తెలిపారు.



# భార్య మీద అనుమానం

- ఆమె పట్ల అత్యంత దారుణంగా ప్రవర్తించిన భర్త



**చత్తీస్‌గఢ్ జూన్ 19;** భార్య మీద అనుమానం పెంచుకున్న ఓ భర్త ఆమె పట్ల అత్యంత దారుణంగా ప్రవర్తించాడు. బలవంతంగా ఆమెకు గుండు గీయించి, ఆపై ముఖానికి మసి పూశాడు. అంతటితో ఆగకుండా ఆమెపై పిల్లలతో మూత్రం పోయించి, అదే మూత్రాన్ని ఆమెతో బలవంతంగా తాగించే అమానుష చర్యకు పాల్పడ్డాడు. జూన్14న చత్తీస్‌గఢ్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది.

# మైనర్లు డ్రైవింగ్ చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు

- సీపీ సజ్జనార్ స్పష్టం చేసిన సీపీ సజ్జనార్



**హైద్రాబాద్ జూన్ 19 :** రాష్ట్రంలో సోమవారం నుంచి విద్యార్థులు బడి బాట పట్టారు. చిన్నారులు సంక్షేమంగా, సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే స్కూల్ బస్సులు, ఆటోల ఫిట్‌నెస్ పరీక్షలూ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మైనర్లు డ్రైవింగ్ చేయడం, డ్రగ్స్ వినియోగించడం వంటి అంశాల పట్ల విద్యాసంస్థలను హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మేరకు నగరంలోని పలు స్కూల్ యాజమాన్యాలతో కలిసి పలు కీలక విషయాలపై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు.

### ఆ పరిస్థితి తీసుకురావద్దు :

మైనర్లు డ్రైవింగ్ చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని విద్యాసంస్థల యాజమన్యాలకు రవీంద్రభారతిలో హైదరా బాద్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ర్యాష్ డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ పై విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. డ్రైవింగ్ చేస్తూ పట్టుబడే మైనర్ల స్కూళ్ల పేర్లను ప్రస్తావించే పరిస్థితి తీసుకురావొద్దంటూ హెచ్చరించారు.

### పాఠశాలలు డీ మెరిట్ విధానాన్ని పాటించాలి

మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడే విద్యార్థుల వివరాలను నేరుగా సంబంధిత పాఠశాలలకు పంపుతామని, వారి ప్రగతి పత్రాల్లో నెగెటివ్ మార్కింగ్ ఇచ్చేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కొందరు స్కూల్ బస్సు డ్రైవర్లు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడుతున్నారని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నారులుండే బస్సులకు డ్రైవర్లుగా ఉంటున్న వారి విషయంలో యాజమాన్యాలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### తల్లిదండ్రులకూ కౌన్సెలింగ్ ఇవ్వాలి :


పాఠశాలల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రతి స్కూల్ విధిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు, ట్రాఫిక్ మార్షల్స్ లేదా వాలంటీర్ల వ్యవస్థను తీసుకురావాలని యాజమాన్యాలకు సీపీ సజ్జనార్ సూచించారు. ఇక ప్రతిరోజూ స్కూల్ అసెంబ్లీలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, సైబర్ క్రైమ్, డిజిటల్ అడిక్షన్, డ్రగ్స్ అనర్థాలపై ఉపాధ్యాయులు విధిగా అవగాహన కల్పించాలన్నారు. పేరెంట్-టీచర్ మీటింగ్స్ ద్వారా తల్లిదండ్రులకూ సామాజిక సమస్యల పట్ల అవగాహన కల్పించాలన్నారు.

### కోప్టా చట్టం అమలు చేస్తున్నాం

అలాగే పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయించకుండా కోప్టా చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని, ఎక్కడైనా అమ్మకాలు జరిగితే వెంటనే అడ్డుకునేలా యాజమాన్యాలు కూడా బాధ్యత తీసుకోవాలని సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సజ్జనార్‌తో పాటు ట్రాఫిక్ జాయింట్ సీపీ, జీహెచ్ఎంసీ కమిషనర్, రవాణా శాఖ కమిషనర్, పాఠశాలల యాజమాన్యాలు హాజరయ్యాయి.మంచి పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత పాఠశాలల యాజమాన్యాలపై ఉంది. మైనర్లు డ్రైవింగ్ చేస్తే అస్సలు సహించేది లేదు. పాఠశాలకు పిల్లలను తీసుకొచ్చే డ్రైవర్లపైనా స్కూల్ యాజమాన్యాలు దృష్టిపెట్టాలి. పిల్లల భద్రతను గాలికి వదిలేయొద్దు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో డ్రైవర్లు దొరికితే విద్యాసంస్థల పేర్లు బయట పెట్టాల్సి వస్తుందన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

- మహేశ్వరం విద్యుత్ అధికారి ఏఈ చక్రపాణి



**మహేశ్వరం జూన్ 19 (నగరనిజం) :** నేడు (శనివారం) విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని మహేశ్వరం విద్యుత్ అధికారి ఏఈ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చెట్ల కొమ్మల తొలగించడం కోసం రావిరాల కొంగర కురుదు వండర్లా కళా జ్యోతిప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకుఓ ఆర్ ఆర్ రావిరాల ఎగ్జిట్ కలెక్టర్ ఆఫీస్ రోడ్డు గుగ్గి విలాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంస్థ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# చౌదరి గూడ భూ బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం





- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- శంషాబాద్ (మం) లోని చౌదరి గూడ వద్ద ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం భూములను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- ఎమ్మెల్యేను కలుసుకున్న బాధిత రైతులు
- తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు రైతుల మొర
- సీఎం రేవంత్ రెడ్డి తో చర్చించి బాధితులకు తగు న్యాయం చేస్తామన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, జూన్ 19 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని చౌదరి గూడ వద్ద తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం నేపథ్యంలో భూములు కోల్పోయే రైతులు అన్ని విధాలుగా ఆదుకుంటామని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ భరోసా ఇచ్చారు. భూములు కోల్పోయే రైతులు రాజకీయ పార్టీల నేతల మాటలు నమ్మి మోసపోవద్దని, బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి తాను కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. విద్యకు పెద్దపీట వేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందుకోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోరంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని చౌదరి గూడ వద్ద సర్వేనెంబర్ 221 లోని ప్రభుత్వ భూముల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అధికారుల బృందంతో కలిసి శుక్రవారం నాడు శంషాబాద్ మండలంలోని చౌదరి గూడ వద్ద ప్రతిపాదిత భూములను పరిశీలించారు. అయితే ఇక్కడ దాదాపు 200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ ఇవి ప్రస్తుతం రైతుల ఆధీనంలో ఉన్నాయి. ప్రభుత్వం స్థానిక రైతులకు అసైన్మెంట్ చేసిన నేపథ్యంలో ఇక్కడి రైతులు తరతరాలుగా వాటిని సాగు చేసుకుని జీవిస్తున్నారు. అయితే ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణం కోసం దాదాపు 20 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో పాటు అధికారుల బృందం చౌదరి గూడలో పర్యటించడంతో బాధిత రైతులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను కలుసుకున్నారు. తరతరాలుగా తాము వ్యవసాయ భూములను నమ్ముకుని జీవిస్తున్నామని, ప్రభుత్వం ఇప్పుడు వాటిని లాగేసుకుంటే తమ బతుకులు రోడ్డున పడతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవితాలను దృష్టిలో పెట్టుకొని న్యాయం చేయాలని బాధిత రైతులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం ఆధ్వర్యంలో బాధిత రైతులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.... భూములు కోల్పోయే రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని చెప్పారు. చౌదరి గూడ వద్ద ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుందని ప్రకాష్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. భూములు కోల్పోయే రైతులకు తగిన విధంగా న్యాయం చేయడానికి తాను శాయ శక్తులా కృషి చేస్తానని, ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. భూములు కోల్పోయే రైతులు రాజకీయ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రకాష్ గౌడ్ హితవు పలికారు.

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను ఘనంగా సన్మానించిన సర్పంచ్ మల్చలం లక్ష్మి లింగం

ఈ సందర్భంగా చౌదరి గూడ సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు షాలువా కప్పి ఘనంగా సన్మానించారు. భూములు కోల్పోయే రైతులను ఆదుకోవాలని సర్పంచ్ లక్ష్మీ లింగం ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అమరలింగం గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఆర్ గణేష్ గుప్తా, కొడిగంటి చంద్రారెడ్డి, దూడల వెంకటేష్ గౌడ్, కొలను మహేందర్ రెడ్డి, బండి గోపాల్ యాదవ్, దండు ఇస్తారి, సర్పంచులు గడ్డం శేఖర్ యాదవ్ (నర్కూడ), కట్కూరి కోటేశ్వర్ గౌడ్ (పాలమాకుల్), మాజీ సర్పంచులు కొత్త యాదగిరి రెడ్డి, రమేష్ యాదవ్, నర్కూడ ఉపసర్పంచ్ నీరటి మహేష్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్, గౌతమి అశోక్, స్థానిక నేతలు హీరే కార్ శివాజీ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





# భూమికి భూమి పరిహారంగా ఇవ్వాలి





- చౌదరి గూడ రైతులు
- దశాబ్దాలుగా అసైన్మెంట్ భూములను నమ్ముకుని జీవిస్తున్నామని రైతుల ఆవేదన
- తమ నోటికాడి కూడును లాక్కోవద్దని ప్రభుత్వానికి రైతుల మొర

**రాజేంద్రనగర్, జూన్ 19 (నగరనిజం ప్రతినిధి):** చౌదరి గూడలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం ప్రభుత్వం తమ భూములను లాక్కుంటే భూమికి భూమి పరిహారంగా ఇవ్వాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. దశాబ్దాలుగా అసైన్మెంట్ భూములను నమ్ముకొని బతుకు బండిని లాగుతున్నామని, ప్రభుత్వం ఉన్నఫలంగా తమకు జీవనాధారమైన వ్యవసాయ భూములను లాగేసుకుంటే తాము రోడ్డున పడతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని చౌదరి గూడ వద్ద సర్వే నెంబర్ 221 లోని ప్రభుత్వ అసైన్మెంట్ భూముల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో భూములు కోల్పోయే బాధిత రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ప్రభుత్వం తమకు అసైన్మెంట్ భూములు కేటాయించాక వాటినే నమ్ముకుని తరతరా లుగా జీవిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం తమకు జీవనాధారమైన వ్యవసాయ భూములను లాగేసుకుంటే తాము జీవనోపాధిని కోల్పోతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం కోసం సేకరించే భూములకు ప్రభుత్వం చెల్లించే పరిహారం తమకు ఏ మాత్రం గిట్టుబాటు కాదు అని, ప్రస్తుతం భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమ భూములను స్వాధీనం చేసుకోవాలని భావిస్తే అందుకు పరిహారంగా భూమికి భూమి ఇవ్వాలి తప్ప డబ్బులు అక్కర్లేదని బాధిత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై తమ పూర్తి భరోసా ఉందని, తప్పకుండా తమకు న్యాయం చేస్తారని భావిస్తున్నట్లు రైతులు అభిప్రాయపడుతున్నారు.



భూమికి భూమి పరిహారంగా మరోచోట తమకు భూములు కేటాయిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని బాధిత రైతులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేద రైతులను దృష్టిలో పెట్టుకొని తమకు న్యాయం చేయాలని చౌదరి గూడ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నగరనిజం

20 శనివారం, జూన్ 2026

# షెడ్డు నిర్మాణం పై చర్యలు ఏవీ...?





- అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యం ఎందుకు
- అధికారుల బాధ్యత రహిత్యానికి నిదర్శనం ఈ షెడ్డు నిర్మాణం కాదా...?
- అధికారులే అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారా...?
- అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఎండగడతామంటూ స్థానికుల హెచ్చరికలు

**నగర నిజం న్యూస్ ) 19 జూన్):** కీసర సర్కిల్ పరిధి మేడ్చల్ జిల్లా పాత కలెక్టరేట్ కార్యాలయం పరిసర ప్రాంతంలో భారీ విస్తీర్ణంలో నిర్మాణం చేస్తున్న అక్రమ షెడ్డు నిర్మాణాన్ని తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు నివాసయోగ్యకరమైన ప్రాంతాల్లో చిన్నపాటి గృహ నిర్మాణం చేసుకోవాలంటే ఎన్నో ఆంక్షలు పెట్టే అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమ తులు లేకుండా చట్టానికి సవాల్ విసురుతు పెద్ద ఎత్తున నిర్మాణం చేస్తున్న ఈ అక్రమ షెడ్డు నిర్మాణం పై చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరు పట్ల ఎన్నో విమర్శలు వెళ్ళువెత్తుతున్నాయి కీసర సర్కిల్ ప్రాంతంలో టౌన్ ప్లానింగ్ వ్యవస్థ విధి నిర్వహ ణలో ఉందా...? లేదా విధి నిర్వహణలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నాయెడల నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ అక్రమ షెడ్డు నిర్మాణం ఏదేచ్ఛగా ఎలా కొనసాగుతుందీ...? టౌన్ ప్లానింగ్ అధికారులు విధి నిర్వహణలో ఉండి కూడా ఈ అక్రమ షెడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకోకపోవడానికి గల కారణాలు ఏమిటీ...? మామూళ్ల మహత్యమా...? అధికారుల బాధ్యత రహిత్య మా...? అక్రమ షెడ్డు నిర్మాణదారుల దుస్సాహసమా...? అని స్థానికులు మండిపడుతున్నారు, ఇప్పటికైనా అధికారులు ఎలాంటి అనుమానాలకు అపోహలకు తావివ్వ కుండా విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిం చకుండా తక్షణమే నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ అక్రమ షెడ్డు నిర్మాణంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు లేనియెడల ఈ అక్రమ షెడ్డు నిర్మాణం వ్యవహారాన్ని విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికా రుల వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్ తో పాటు జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు

# రూ.87 కోట్ల విలువైన సీఆర్ఎఫ్ రోడ్ల పనులకు శంకుస్థాపన





- తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయి
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి వర్యులు గంగాపురం కిషన్ రెడ్డి

**రంగారెడ్డి ప్రతినిధి, జూన్ 19 ( నగరనిజం ) :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో చేపట్టిన, పూర్తయిన సుమారు రూ.87 కోట్ల విలువైన సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఎఫ్) రోడ్ల పనులకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... తిమ్మాపూర్ గ్రామానికి వివిధ ప్రాంతాలతో మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో పలు రహదారి నిర్మాణ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. కొంగర, రావిరాల, శ్రీశైలం రోడ్డు, లాచునూరు, అవరమియగూడెం, జబార్‌గూడ, ఎలిమినేడు, కప్పాడు, తుర్కగూడెం, చర్లపటేల్‌గూడెం, ఇబ్రహీంపట్నం రోడ్డు, గుమ్మడవెల్లి, మీర్‌ఖాన్‌పేట, కుర్మిద్ద తదితర ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా మాదాపూర్, బేగంపేట్ ప్రాంతాలతో కూడా కనెక్టివిటీ పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రాంతం పట్టణీకరణ దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

## తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు

దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుల్లో భాగంగా తెలంగాణకు మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రతిపాదించబడినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. హైదరాబాద్-పూణే, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మార్గాల్లో బుల్లెట్ ట్రైన్ల ఏర్పాటుకు ప్రాథమిక అంచనా వ్యయం సుమారు రూ.5 లక్షల కోట్లు కాగా, భూసేకరణ వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇది రూ.10 లక్షల కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్లకు సంబంధించిన సర్వే పనులు కొనసాగుతున్నాయని, సర్వే మరియు డీపీఆర్ (డీపీఆర్) పూర్తైన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈ మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయని అభిప్రాయపడ్డారు. అలాగే హైదరాబాద్ చుట్టుపక్కల మరో రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే దిశగా కూడా ఆలోచనలు జరుగుతున్నాయని, ఉత్తర హైదరాబాద్ ప్రాంతంలో భూసేకరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని రంగారెడ్డి జిల్లా గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి రహదారి అనుసంధానం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషితో ఈ ప్రాంతానికి కేంద్ర నిధుల ద్వారా రూ.100 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడం వల్ల కొన్ని రహదారి పనులు ఆలస్యమైన విషయం వాస్తవమేనని అంగీకరించిన మంత్రి, ఇకపై అలాంటి పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొంగర, రావిరాల, తిమ్మాపూర్, లాచునూరు, అవరమియగూడెం తదితర ప్రాంతాలకు సంబంధించిన అన్ని రహదారి నిర్మాణ పనులను తక్షణమే సమీక్షించి, రాబోయే కొద్ది నెలల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రంగారెడ్డి జిల్లా, ముఖ్యంగా కందుకూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్, టీపీసీసీ సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాగారం లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

- దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారు





**జూన్ 19,మహబూబ్ నగర్(నగర నిజం ప్రతినిధి)**దేవరకద్ర మండలం నాగారం గ్రామంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత,లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం రోజు గ్రామ సర్పంచ్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి,బాణాసంచా కాలుస్తూ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ,యువతకు అవకాశాల కల్పన,సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.అదే విధంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని,ప్రజా సంక్షేమమే పార్టీ ప్రధాన లక్ష్యమని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజిల్ రెడ్డి,రాజేందర్ రెడ్డి(మచేందర్)వివిధ గ్రామాల సర్పంచ్,ఉప సర్పంచ్ లు గ్రామ అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక చైతన్యానికి ఒక శక్తివంతమైన సాధనంగా మారిన సోషల్ మీడియా

- యువతపై సోషల్ మీడియా విశేష ప్రభావం




**హైద్రాబాద్ జూన్ 19;**21వ శతాబ్దంలో సమాచార సాంకేతిక రంగం విపరీతంగా అభివృద్ధి చెందడంతో సామాజిక చైతన్యా నికి ఒక శక్తివంతమైన సాధనంగా మారింది సోషల్ మీడియా.దీనితో ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపో యింది. ఈ మార్పులో సోషల్ మీడియా అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. ఒకప్పుడు వార్తలు తెలుసుకోవడానికి పత్రికలు, రేడియో, టెలివిజన్ వంటి సంప్రదాయ మాధ్యమాలపై ఆధారపడాల్సి వచ్చేది. కానీ నేడు మొబైల్ ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచంలో ఎక్కడ ఏం జరుగుతుందో క్షణాల్లో తెలుసుకునే అవకాశం కలిగింది. ఫేస్బుక్, వాట్సాప్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలు ప్రజల జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. అయితే సోషల్ మీడియా సమాజానికి వరమా, శాపమా అనే చర్చ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా ఇది సామాజిక చైతన్యాన్ని పెంచుతున్నదా? లేక సమాజంలో విభేదాలు, విద్వేషాలు పెంచడానికి కారణమవుతున్నదా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.సోషల్ మీడియా సామాజిక చైతన్యానికి ఒక శక్తివంతమైన సాధనంగా మారింది. గతంలో ప్రజలకు తెలియని అనేక సామాజిక సమస్యలు ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వస్తున్నాయి. ఎక్కడైనా అన్యాయం జరిగినా, అవినీతి జరిగినా, ప్రజల హక్కులు తీవ ఉల్లంఘించబడినా క్షణాల్లో లక్షల మందికి సమాచారం చేరుతోంది. దీంతో ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ముఖ్యంగా విద్యార్థులు, యువత, మహిళలు, వెనుకబడిన వర్గాలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి సోషల్ మీడియా మంచి వేదికగా నిలిచింది. ఒకప్పుడు ప్రధాన మీడియా ప్రాధాన్యం ఇవ్వని అంశాలు కూడా సోషల్ మీడియా ద్వారా దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్నాయి.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంలో కూడా సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వ విధానాలు, చట్టాలు, ప్రజా సమస్యలపై ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు. అనేక సందర్భాల్లో ప్రజల స్పందనను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు నిర్ణయాలు మార్చుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. సామాజిక ఉద్యమాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, హక్కుల సాధన కోసం జరిగే పోరాటాలు సోషల్ మీడియా ద్వారా మరింత బలపడుతున్నాయి. ఒక ప్రాంతంలో ప్రారంభమైన ఉద్యమం దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందడానికి సోషల్ మీడియా ప్రధాన కారణంగా నిలుస్తోంది.సోషల్ మీడియాకు మరో ముఖం కూడా ఉంది. అదే దుర్వినియోగం. తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలు, వదంతులు సోషల్ మీడియా ద్వారా వేగంగా వ్యాపిస్తున్నాయి. ఏ సమాచారం నిజమో, ఏది అబద్ధమో తెలుసుకోవడం సాధారణ ప్రజలకు కష్టంగా మారుతోంది. కొందరు వ్యక్తులు, సంస్థలు లేదా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే సమాచా రాన్ని ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేస్తున్నారు. దీనివల్ల సమాజంలో గందరగోళం ఏర్పడటమే కాకుండా కొన్నిసార్లు హింసాత్మక సంఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి.కుల, మత, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టడంలో కూడా సోషల్ మీడియా కొంతమేర ప్రతికూల పాత్ర పోషిస్తోంది. ద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలు సమాజంలో సామరస్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. ఒక చిన్న సంఘటనను వక్రీకరించి ప్రచారం చేయడం వల్ల పెద్ద ఎత్తున ఉద్రిక్తతలు ఏర్పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా యువతపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. సమాచారాన్ని పొందడానికి ఉపయోగపడుతున్నప్పటికీ, అధిక వినియోగం వ్యసనంగా మారుతోంది. గంటల తరబడి మొబైల్ ఫోన్లలో గడపడం వల్ల చదువులు, ఉద్యోగాలు, కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయి. ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకొని నిరాశకు గురయ్యే పరిస్థితులు కూడా పెరుగుతున్నాయి. మానసిక ఆరోగ్య సమస్యలు, ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలకు కూడా సోషల్ మీడియా అధిక వినియోగం ఒక కారణంగా మారుతోందని జ౼ు నిపుణులు చెబుతున్నారు. అయితే రాజకీయ రంగంలో సోషల్ మీడియా ప్రభావం అత్యంత ఎక్కువగా ఉంది. రాజకీయ పార్టీలు ప్రజలకు చేరువ కావడానికి దీనిని కొన్నిసార్లు వాస్తవ చర్చల కంటే ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు, ద్వేషపూరిత వ్యాఖ్యలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో విభేదాలను శత్రుత్వంగా మార్చే ధోరణి పెరుగుతోంది. ఇది ప్రజాస్వామ్య విలువలకు కూడా సవాలుగా మారుతోంది. సోషల్ మీడియా మంచిదా చెడ్డదా అనే ప్రశ్నకు ఒకే సమాధానం ఉండదు. అది పూర్తిగా దానిని ఉపయోగించే వ్యక్తులపై ఆధారపడి ఉంటుంది. కత్తితో పండును కోయవచ్చు, అదే కత్తితో హాని కూడా చేయవచ్చు. అలాగే సోషల్ మీడియా ద్వారా జ్ఞానాన్ని పంచవచ్చు, సమాజాన్ని చైతన్యవంతం చేయవచ్చు. అదే సమయంలో అసత్యాలు, విద్వేషాలు కూడా వ్యాప్తి చేయవచ్చు. కాబట్టి సమస్య వేదికలో కాదు, దాని వినియోగంలో ఉంది.ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం అత్యంత అవసరం. ఏ సమాచారాన్ని అయినా నమ్మే ముందు దాని నిజానిజాలను పరిశీలించాలి. ద్వేషపూరిత ప్రచారాలకు దూరంగా ఉండాలి. సమాజంలో ఐక్యత, సామరస్యం, అవగాహన పెంచే సందేశాలను ప్రోత్సహించాలి. ముఖ్యంగా యువత సోషల్ మీడియాను జ్ఞానార్జన, వ్యక్తిత్వ వికాసం, సామాజిక చైతన్యం కోసం ఉపయోగించాలి. మొత్తంగా చూస్తే సోషల్ మీడియా ఒక శక్తివంతమైన సాధనం. అది సామాజిక చైతన్యానికి గొప్ప వేదికగా మారగలదు. అదే సమయంలో దుర్వినియోగం చేస్తే సమాజంలో విభేదాలు, విద్వేషాలు పెంచే ప్రమాదం కూడా ఉంది. సోషల్ మీడియాను బాధ్యతతో, వివేకంతో వినియోగించినప్పుడే అది సమాజ పురోగతికి దోహదపడే సాధనంగా నిలుస్తుంది.

**వ్యాసకర్త, బూర్గుపల్లి కృష్ణ యాదవ్**

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

నగరనిజం

20 శనివారం, జూన్ 2026

# 131వ డివిజన్‌లో పలు కాలనీల్లో పర్యటించిన జాలిగం రాకేష్

- సమస్యల పరిష్కారానికి హామీ



**కుత్బుల్లాపూర్, 19 జూన్ (నగర నిజం ప్రతినిధి):** జీమెట్ సర్కిల్ పరిధిలోని 131వ డివిజన్‌లో పలు కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిశీలించేందుకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జాలిగం రాకేష్ విస్తృతంగా పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాన్‌హోల్స్ జామ్ కావడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించా లని సూచించారు. అదేవిధంగా రోడ్లపై ఏర్పడిన గుంతలను పరిశీలించి ప్రజలకు ప్రమాదకరంగా మారిన పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న జాలిగం రాకేష్, కాలనీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. స్థానికుల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# భవిష్యత్తులో రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావడం ఖాయం

- రాష్ట్ర కాంగ్రెస్ నేత జెల్లపల్లి నరేందర్
- రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శంషాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ నేతలు
- వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ జెల్లపల్లి నరేందర్, శంషాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్





**రాజేంద్రనగర్, జూన్ 19 (నగరనిజం ప్రతినిధి):** పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ విపక్ష నేత, కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ భవిష్యత్తులో భారతదేశానికి ప్రధానమంత్రి కావడం ఖాయమని రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జెల్లపల్లి నరేందర్ విశ్వాసం వ్యక్తం చేశారు. యువ నాయకుడిగా అన్ని వర్గాలను కలుపుకొని దేశాన్ని ముందుకు నడిపించే సత్తా రాహుల్ గాంధీకి ఉందని నరేందర్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం నాడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శంషాబాద్ ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జెల్లపల్లి నరేందర్ తోపాటు శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పిల్లన గ్రోవిల సంజయ్ యాదవ్ తదితర కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. ఈ మేరకు రోగులకు పండ్లు పంపిణీ చేసిన నరేందర్.... రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. గాంధీ కుటుంబ వారసుడిగా, కాంగ్రెస్ యువనేతగా దేశాన్ని సమర్థవంతంగా పరిపాలించే సత్తా రాహుల్ గాంధీకి ఉందని చెప్పారు. ఓట్ చోరి రాజకీయాలతో బీజేపీ అధికారంలో కొనసాగుతోందని నరేందర్ మండిపడ్డారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో గాంధీ కుటుంబ వారసుడిగా రాహుల్ గాంధీ భవిష్యత్తులో దేశానికి ప్రధాని కావడం ఖాయమని నరేందర్ విశ్వాసం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగిందని శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి సంజయ్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేవుడి ఆశీస్సులతో రాహుల్ గాంధీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరిస్తారని సంజయ్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శంషాబాద్ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, శంషాబాద్ మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచమల్ల గణేష్, పార్టీ యువ నేతలు శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.50.73 కోట్లతో రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ జూన్19 ; రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి రూ.50.73 కోట్లతో రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి . శ్రీకారం చుట్టారు.రూ.36.65 కోట్లతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మినీ స్టేడియంల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి శంకుస్థాపన చేసిన సీఎం
రూ.14.08 కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియంలలో బాల బాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను ప్రారంభించిన సీఎం

### శంకుస్థాపనల వివరాలు:

రూ.10 కోట్లతో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం
రూ.10 కోట్లతో సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డా.,బీఆర్ అంబేద్కర్ స్టేడియం ఆధునీకరణ
రూ.4 కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం
రూ.4 కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణంలో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్ట్స్ నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి.
రూ.3.50 కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం
రూ.2.65 కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం
రూ.2.50 కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్ ఛ కబడ్డీ కోర్ట్స్ నిర్మాణం.

### ప్రారంభోత్సవాల వివరాలు:

రూ.5.70 కోట్లతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన FIFA AIFF తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం
రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన FIFA AIFF తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం
రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం
రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం
రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం
రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం
రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం
రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం

# గ్రామీణ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దండి





- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- మొబైల్ ఫోన్లు వద్దు.... చదువులు ముద్దు అన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- నానాజీపూర్ వద్ద పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఫీజులు వసూలు చేయాలని ఎమ్మెల్యే సూచన
- విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ప్రకాష్ గౌడ్ పిలుపు

**రాజేంద్రనగర్, జూన్ 19 (నగరనిజం ప్రతినిధి):** గ్రామీణ ప్రాంతాల్లో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ రావడం అభినందనీయమన్నారు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. ఇంటర్నేషనల్ స్కూల్ రావడంతో శంషాబాద్ పరిధిలోని నానాజీపూర్ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి తప్ప మొబైల్ ఫోన్లకు బానిస కావద్దని, తమ పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రకాష్ గౌడ్ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని నానాజీపూర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం నాడు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.... నానాజీపూర్ వంటి గ్రామీణ ప్రాంతంలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని చెప్పారు. విశాలమైన మైదానం, భారీ భవనంలో సకల సదుపాయాలతో కూడిన పాఠశాల అందుబాటులోకి రావడం అభినందనీయ మన్నారు. పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుతో నానాజీ పూర్ తో పాటు శివారు గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించడం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులను తీర్చిదిద్దడానికి పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం చేస్తున్న కృషిని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభినందించారు.మరోవైపువిద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజ మాన్యం కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు. ప్రస్తుతం ఎందరో యువకులు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్రానికి, అటు దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తెస్తున్నారని, ఆ దిశగా విద్యార్థులు క్రీడల్లో రాణించేలా కృషి చేయాలని ఆయన సూచించారు. పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ కు విశాలమైన మైదానం ఉన్న నేపథ్యంలో విద్యార్థులు వివిధ క్రీడల్లో ఆసక్తి కనబరచాలని ప్రకాష్ గౌడ్ దిశా నిర్దేశం చేశారు. మరోవైపు నేటి సమాజంలో స్మార్ట్ ఫోన్లు అందుబాటులోకి వచ్చాక ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్లకు బానిసగా మారుతున్నారని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. వయస్సుతో నిమిత్తం లేకుండా పసిపిల్లలు సైతం మొబైల్ ఫోన్లకు బానిసగా మారిపోతున్నారని, అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని ఆయన హెచ్చరించారు. గంటల తరబడి మొబైల్ ఫోన్లకు అంకితం అవుతుండడంతో విద్యార్థులు తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో కూడిన ప్రైవేటు పాఠశాలలు రావడం శుభ సూచకమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభిప్రాయపడ్డారు. పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం నిరుపేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఫీజులు వసూలు చేయాలని ప్రకాష్ గౌడ్ సూచించారు. విద్య కార్పొరేట్ రూపు సంతరించుకున్న నేపథ్యంలో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, తద్వారా లక్షలు పోసి తమ పిల్లలను చదివించుకోలేకపోతున్నారని ప్రకాష్ గౌడ్ వాపోయారు. ఈ తరుణంలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం పేద మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని వారి పిల్లలకు ఫీజుల్లో రాయితీ కల్పించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కోరారు. మరోవైపు తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను ప్రైవేటు బడుల్లో చదివిస్తున్నారని, అందువల్ల విద్యార్థులు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి పైకి రావాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ విద్యార్థులకు సూచించారు.

### విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే మా లక్ష్యం - పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం

విద్యార్థులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందించడమే తమ లక్ష్యమని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతినిధులు అన్నపూర్ణ నారాయణమూర్తి కోడూరు, అనురాధ కిషోర్ కుమార్, కర్ణ కోటి సంధ్య ఈశ్వర్ జీ, మానస కోడూరు ప్రకటించారు. విద్యా ప్రతిభ తో పాటు వ్యక్తిత్వ వికాసం, మానవ విలువలు, అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ప్రతి ఒక్క విద్యార్థి దేశం గర్వపడేలా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని పేర్కొన్నారు.

### ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించిన పల్లవి స్కూల్ యాజమాన్యం ప్రతినిధులు

ఈ సందర్భంగా పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో పాటు పలువురు రాజకీయ నాయకులను స్కూల్ యాజమాన్యం ప్రతినిధులు అన్నపూర్ణ, నారాయణమూర్తి కోడూరు, కర్ణకోటి సంధ్య ఈశ్వర్ జీ తదితరులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఆర్ గణేష్ గుప్తా, దూడల వెంకటేష్ గౌడ్, కొడిగంటి చంద్రారెడ్డి, కొలను మహేందర్ రెడ్డి, బండి గోపాల్ యాదవ్, చిన్న గోల్కొండ సహకార బ్యాంకు చైర్మన్ బొమ్మ దవణాకర్ గౌడ్,నానాజీపూర్ సర్పంచ్ మైలారం సురేఖ రాజు, ఉప సర్పంచ్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్ గౌడ్, నానాజీపూర్ మాజీ సర్పంచ్ సీమారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మైలారం కృష్ణ, మల్కారం మాజీ సర్పంచులు అయినాల జగన్ మోహన్ రెడ్డి,కొత్త యాదగిరిరెడ్డి, సుల్తాన్ పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం ప్రతినిధులు అన్నపూర్ణ నారాయణ మూర్తి కోడూరు, అనురాధ కిషోర్ కుమార్, కర్ణకోటి సంధ్య ఈశ్వర్ జీ, కాంగ్రెస్ నేత హీరే కార్ శివాజీ,నానాజీపూర్ స్థానిక నేతలు రామ్ రెడ్డి, పిట్టల శ్రీశైలం, కర్ణకోటి మధు , లక్ష్మయ్య తదితర పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





# శ్వాసకోశ లేదా గుండె వైఫల్యంతో బాధపడుతున్న వారికి యశోద హాస్పిటల్స్ సోమాజిగూడలో అత్యాధునిక పద్ధతిలో వైద్యం

**ఇప్పటివరకు ఎక్స్ ట్రా కార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ (ఎక్మో ) ఈసీఎంవో ద్వారా కొన్ని వందల కేసులు పరిష్కారం**




ఖమ్మం: (నగర నిజం బ్యూరో) జూన్ 19,ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ సీనియర్ డాక్టర్ వై.సూర్య ప్రకాష్ ఎంబీబీఎస్ , డి ఎన్ బి , , ఐ డి సి సి ఎం ఖీజజూ ఎఫ్ సి సి ఎస్ మాట్లాడుతూ సాధారణ చికిత్సలు సరిపోని పరిస్థితులలో ప్రాణాలను కాపాడటంలో అధునాతన క్రిటికల్ కేర్ విధానాలలో ఎక్మో (ఈసీఎంవో) ఒకటి . శ్వాసకోశ లేదా గుండె వైఫల్యంతో బాధపడుతున్న పేషేంట్లకు ఎక్స్ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ (ఈ సి ఎం ఓ) లాంటి సాంకేతికతలు ప్రాణాలను నిలబెట్టే పరిష్కారాలుగా మారాయి అని కృత్రిమ గుండె , ఊపిరితిత్తుల లాగా పనిచేస్తూ ఎక్మో ఈసీఎంవో శరీరంలోని ముఖ్యమైన అవయవాల పనితీరుకు మద్దతు ఇస్తుంది , తద్వారా పేషేంట్ శరీరం కోలుకోవడానికి తగిన సమయం లభిస్తుంది . అలాగే , పారాక్వాట్ విషప్రభావం , డ్రగ్ ఓవర్డోస్ వంటి తీవ్రమైన విషప్రభావాల కేసులను నిర్వహించడంలో ప్రత్యేక డయాలసిస్ మరియు ఎక్మో ఈ సీ ఎం ఓ థెరపీలు ఎంతో ఉపయోగపడుతున్నాయి అని అన్నారు . ఒకప్పుడు ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణాపాయం ఎక్కువగా ఉండేది . గత దశాబ్ద కాలంలో క్రిటికల్ కేర్ వైద్యరంగంలో సాధించిన అద్భుతమైన ప్రగతి ఈ అత్యాధునిక విధానాలు . ఇవి ప్రాణాంతక పరిస్థితుల నుంచి బయటపడేలాపనిచేస్తున్నాయని తెలిపారు . యశోద ఆసుపత్రి అధునాతన క్రిటికల్ కేర్ మౌలిక సదుపాయాలు , మల్టీడిసిప్లినరీ నిపుణులు , ఎవిడెన్స్ – బేస్డ్ ట్రీట్మెంట్ ప్రోటోకాల్స్లు లో ప్రత్యేక శ్రద్ధ పెడుతూనే ఉంది . ఐసీయూ అవేర్నెస్ వంటి కార్యక్రమాల ద్వారా ఆధునిక ఇంటెన్సివ్ కేర్ ప్రాణాలను ఎలా కాపాడుతుంది మరియు రోగులు కోలుకోవడంలో ఇది పోషించే కీలక పాత్ర గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసామని అన్నారు . ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు , పరమేశ్ , నాగార్జున , బాలకృష్ణ పాల్గొన్నారు.

# ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్లు 17,18,31 నిబంధనల ప్రకారం అమలు

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



మెదక్ జిల్లా, మెదక్ బ్యూరో : నగర నిజం :ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్లు 17, 18 మరియు 31 ప్రకారం క్రింది నిబంధనలు అమలులో ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తెలియజేశారు. సెక్షన్ – 17 ఏ వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాలలో ఓటరు జాబితాలలో నమోదు కావడానికి అర్హుడు కాడు. సెక్షన్ 18: ఏ వ్యక్తి ఒకే నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో ఒకటి కంటే ఎక్కువ సార్లు నమోదు కావడానికి అర్హుడు కాడు. సెక్షన్ – 31: ఏవ్యక్తి, ఓటరు జాబితా తయారీ, సవరణ లేదా దిద్దుబాటుకు సంబంధించి, లేదా ఓటరు జాబితాలో ఏదైనా పేరును చేర్చడం లేదా తొలగించడం సంబంధించి, తాను ఇచ్చిన సమాచారం అసత్యమని తెలిసినా, లేదా అసత్యమని నమ్మినా, లేదా నిజమని నమ్మని ఏదైనా తప్పుడు ప్రకటన లేదా లిఖితపూర్వక ధృవీకరణ సమర్పించినట్లయితే, అతనికి ఒక సంవత్సరం వరకు కారాగార శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించబడవచ్చునని తెలియజేయడం జరిగింది. జిల్లా లోని ఓటర్లు జూన్ 25 నుండి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్.(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో పాల్గొని ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు బూత్ లెవల్ అధికారులు ఇచ్చే ఫారంను పూరించి ఇవ్వాల్సిందిగా కోరారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 లోని సెక్షన్ 17, 18 మరియు 31 అమలులో ఉన్నందున ఓటర్లు తప్పులు చేయకుండా జాగ్రత్తగా వివరాలు ఇవ్వాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలి గులాబీ నేత రాచమల్ల జయసింహ

**21న శంషాబాద్ జేడీ కన్వెన్షన్ లో తలపెట్టిన కేటీఆర్ కార్యక్రమానికి కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపు**





రాజేంద్రనగర్, జూన్ 19(నగరనిజం ప్రతినిధి)జూన్ 21వ తేదీన గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ లో తలపెట్టిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు ఆ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ. కేటీఆర్ సభకు శంషాబాద్ సర్కిల్ పరిధిలోని 118,119 డివిజన్ల నుండి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన సూచించారు. ఓటర్ జాబితా సవరణ లో భాగంగా నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జూన్ 21వ తేదీన గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని జేడీ కన్వెన్షన్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సారథ్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కేటీఆర్ తో పాటు మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితర జిల్లా సీనియర్ నాయకులు హాజరవుతారని బీఆర్ఎస్ పార్టీ శంషాబాద్ 118, కొత్వాల్ గూడ 119 డివిజన్ల ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ తెలిపారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయడానికి పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ నాయకులు కార్యకర్తలు అంతా సమిష్టిగా కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలని రాచమల్ల జయసింహ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.జేడీ కన్వెన్షన్ వేదికగా నిర్వహించనున్న పార్టీ కార్యకర్తల సమావేశం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యలపై పార్టీ చేపట్టాల్సిన పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణ పై కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు రాచమల్ల జయసింహ సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ , కొత్వాల్ గూడ డివిజన్ల నుండి పార్టీ శ్రేణులు భారీగా ఈ సమావేశానికి తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అబ్దుల్లాపూర్ మెట్ రైతు వేదికలో పీఎం కిసాన్ 23వ విడత కార్యక్రమం

**అబ్దుల్లాపూర్ మెట్, జూన్ 19, (నగర నిజం) : పీఎం కిసాన్ సమాన్ నిధి 23వ విడత నిధుల విడుదల కార్యక్రమం శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేత నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని అబ్దుల్లాపూర్ రైతు వేదికలో వీడియో సమావేశం ద్వారా కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు, గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, ముద్రిత, దృశ్య మాధ్యమాల ప్రతినిధులు, రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందజేయనున్న 23వ విడత ఆర్థిక సహాయ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.**

# చదువే భవిష్యత్‌కు బంగారు బాట

**ప్రతి చిన్నారి బడిబాట పట్టాలి**
**ఎంఈఓ శంకర్**
**సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం**
**విద్యార్థులకు పలకలు, బలపాల పంపిణీ**



మెదక్ బ్యూరో, నగర నిజం :, జూన్ 19:చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం, ఉన్నత స్థానం లభిస్తాయని మెదక్ ఎంఈఓ శంకర్ అన్నారు. మెదక్ పట్టణంలోని ఫతేనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం విద్యా వేడుకగా మారింది. చిన్నారుల భవిష్యత్‌కు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ శంకర్ మాట్లాడుతూ, విద్య అనేది వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిని కూడా ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్య అందించాలని పిలుపునిచ్చారు.అక్షరాభ్యాసంతో ప్రారంభమయ్యే విద్యా ప్రయాణం ఉన్నత శిఖరాలకు చేర్చగలదని ఆయన అన్నారు. చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడం ద్వారా విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నామని చెప్పారు. సమాజ సేవే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు.కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలు, దేశభక్తి ప్రదర్శనలతో చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు.తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజమణి, గౌస్ ఖురేషీ, ప్రధానోపాధ్యాయుడు దేవాజీ దేవాజీ అశోక్, ఉపాధ్యాయులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు రిజిస్ట్రీ నమోదు పూర్తి చేసుకోవాలి



అబ్దుల్లాపూర్ మెట్, జూన్ 19, (నగర నిజం) :తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శైలజ రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే యూరియాను బుక్ చేసుకుని ఎరువుల దుకాణాల వద్ద క్యూలలో నిలబడే అవసరం లేకుండా సౌకర్యవంతంగా ఎరువులు పొందవచ్చని తెలిపారు.ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ఆదర్శంగా తీసుకుని భారత ప్రభుత్వం "ఎరువుల విక్రయాల కోసం వ్యవసాయ కార్యాచరణ" మొబైల్ యాప్‌ను రూపొందించిందని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు ఎరువులను ముందుగానే బుక్ చేసుకుని లబ్ధి పొందవచ్చని వివరించారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి రైతు భూమి వివరాలు, ఇతర సమాచారాన్ని సమగ్రంగా నమోదు చేయడానికి రైతు రిజిస్ట్రీ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రైతు రిజిస్ట్రీ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, పంటల బీమా, ఎరువులు, విత్తనాలు తదితర వ్యవసాయ సేవలు పారదర్శకంగా రైతులకు చేరే అవకాశం కలుగుతుందని చెప్పారు.రైతు రిజిస్ట్రీ వల్ల ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా రైతులకు చేరడంతో పాటు పంటల నమోదు, పంటల బీమా ప్రక్రియ సులభతరం అవుతుందని తెలిపారు. ఎరువుల బుకింగ్ యాప్‌లో భూ వివరాలు ప్రదర్శించేందుకు రైతు రిజిస్ట్రీ నమోదు గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, ఇతర సబ్సిడీల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు రైతుల వివరాలు ఒకే డిజిటల్ వేదికలో అందుబాటులో ఉంటాయని వివరించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్, పట్టాదారు పాసు పుస్తకంతో గ్రామ వ్యవసాయ విస్తరణాధికారి లేదా సమీప మీ సేవా కేంద్రాన్ని సంప్రదించి రైతు రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు.

# జీడీసీ హయత్‌నగర్‌లో ఏఐ, డిజిటల్ లెర్నింగ్ ఇంటర్న్‌షిప్ ప్రారంభం

**డిజిటల్ భవిష్యత్తుకు విద్యార్థులను సిద్ధం చేసే దిశగా రెండు రోజుల శిక్షణ కార్యక్రమం**






హయత్‌నగర్, జూన్ 19 (నగర నిజం): ప్రభుత్వ డిగ్రీ కళాశాల (జీడీసీ) హయత్‌నగర్‌లో "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డిజిటల్ లెర్నింగ్" అంశంపై రెండు రోజుల టీచింగ్ ఇంటర్న్‌షిప్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వ కాలేజియేట్ విద్యా కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అన్న–అక్క మెంటార్‌షిప్/ఇంటర్న్‌షిప్" కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ చేపట్టారు. "డిజిటల్ భవిష్యత్తు కోసం ఏఐ ద్వారా విద్యావేత్తలను సాధికారపరచడం" అనే అంశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు అధ్యక్షత వహించారు. ఉప ప్రిన్సిపాల్ వి. ఇందిర మాట్లాడుతూ ప్రస్తుత ఉద్యోగ విపణిలో డిజిటల్ నైపుణ్యాల ప్రాధాన్యతను, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని వివరించారు. మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన డా. పి. బిక్షపతి మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరిస్తూ అధ్యాపకులు, ఐదవ సెమిస్టర్ విద్యార్థులకు ఏఐ టూల్స్, స్మార్ట్ క్లాస్‌రూమ్ విధానాలు, స్వయం, ఎన్‌పిటిఇఎల్ వంటి ఆన్‌లైన్ వనరులు, ఏఐ ఆధారిత మూల్యాంకన పద్ధతులపై శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా డా. పి. సురేష్ బాబు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్ సాంకేతికత మాత్రమే కాకుండా నేటి అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఏఐను నైతికంగా వినియోగించి తమ అభ్యాస, బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. వి. ఇందిర మాట్లాడుతూ ఇటువంటి శిక్షణలు విద్యార్థులను ఉన్నత విద్య, పోటీ పరీక్షలు మరియు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డా. డి. బాల నరసింహ, ఎన్. నరసింహ, ఎన్. బాల నోడల్ అధికారులుగా సమన్వయం చేస్తున్నారు. శిక్షణలో కళాశాలకు చెందిన ఐదవ సెమిస్టర్‌కు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమం పూర్తయిన అనంతరం పాల్గొన్న వారికి అకడమిక్ క్రెడిట్లు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధు, డాక్టర్ శేఖర్, డాక్టర్ మక్ల, డాక్టర్ యాదగిరి, డాక్టర్ అవేస్, డాక్టర్ దుర్గాప్రసాద్, రజిత, మమత, ఉమారాణి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నగరనిజం


# పెయింటింగ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**23న మేడ్చల్‌లో ర్యాలీ నిర్వహణ**




మేడ్చల్, జూన్ 19 (నగర నిజం):భవన నిర్మాణ కార్మిక రంగంలో భాగమైన పెయింటర్స్, పెయింటింగ్ కాంట్రాక్టర్లు మేడ్చల్‌లోని తమ కార్యాలయంలో శుక్రవారం సమావేశమై ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో తమ వద్ద పనిచేస్తున్న కార్మికులు కూలీ రేట్లు పెంచాలని కోరడంతో, వారికి అనుగుణంగా కూలీ రేట్లు పెంచి సహకరించినట్లు కాంట్రాక్టర్లు తెలిపారు.అయితే, మేడ్చల్ పరిధిలోని పలువురు బిల్డర్లు, ఇంటి యజమానులు పనికి తగిన గిట్టుబాటు రేట్లు చెల్లించకపోవడంతో పెయింటింగ్ కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ఖర్చులు, కార్మికుల వేతనాల భారం మధ్య సరైన రేట్లు లేకపోవడం వల్ల రంగం సంక్షోభంలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బిల్డర్లు, ఇంటి యజమానులు, మేస్త్రీలు పెయింటింగ్ పనులకు తగిన రేట్లు నిర్ణయించి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం, ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 23వ తేదీ మంగళవారం మేడ్చల్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.ర్యాలీలో ప్రతి ఒక్క పెయింటింగ్ కాంట్రాక్టర్, పెయింటర్, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ అధ్యక్షుడు సిహెచ్. యాదగిరి పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు పెయింటింగ్ కాంట్రాక్టర్లు, కార్మికులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రతి ఓటరు వివరాలను సమగ్రంగా పరిశీలించాలి**
**ప్రతి ఇంటికి బీఎల్‌వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి**
**డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి అభ్యంతరాలు, క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలి**
**రఘునాథపాలెం మండలం కేంద్రంలో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమం ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**







ఖమ్మం(నగర నిజం బ్యూరో) జూన్ – 19:ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కు ప్రజలందరూ తమ పూర్తి వివరాలతో స్వచ్ఛందంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.శుక్రవారం ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకత తో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్ లో భాగమైన మండలాలు, కార్పోరేషన్, మున్సిపాలిటీ సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్ చేసే విధంగా టార్గెట్ పెట్టుకొని వంద శాతానికి చేరుకోవాలన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నారన్నారు. డబుల్ ఓట్లు, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రధాన లక్ష్యం, ఎన్నికల సిబ్బంది విధులు, పౌరుల భాగస్వామ్యం, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై అవగాహన పెంచడం ద్వారా ప్రతి అర్హ పౌరుడు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావడానికి సహకరించాలని అధికారులు కృషి చేయాలన్నారు.బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చి, అనర్హులైన ఓటర్ల వివరాలను తొలగించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీలతొలగింపు జరుగుతుందని తెలిపారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తి స్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ప్రతి బీఎల్‌వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ అన్నారు. వివరాలు, కావాల్సిన ధృవీకరణలు బూత్ స్థాయి అధికారి సందర్శన సందర్భంగా సిద్ధం గా ఉంచాలన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలందరూ సంపూర్ణంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# 21న బాసర సరస్వతి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అష్టావధానం



బాసర జూన్ 19, (నగర నిజం) :శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపంలో గల శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ ము కోటి పార్థివశివలింగ శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగమందిర మాసోత్సవం సందర్భంగా 21న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాధశర్మ సంధ్య దంపతులు తెలిపారు.. ఈ సందర్భంగాకవితావిద్వన్మణి ,అవధాన విభూషణ విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి అష్టావధానం చేయనున్నారు. ఈ అవధానము నకు ముఖ్య అతిథిగా ప్రముఖ కవి ,విశ్రాంత మండల విద్యాధికారి , బ్రహ్మశ్రీ గణపతి అశోక్ శర్మ ,పద్యకోకిల ,అభినవ చ్రూళ్ళపిళ్ళ డా..ఓంప్రకాశ్ బోచ్కర్ సంచాలకులు గా,పృచ్ఛకులు గా ..ఆచార్య గొట్లూరి సురేశ్బాబు(నిషిద్ధాక్షరి).,మైరోళ్ళ అశోక్ గౌడు (సమస్య) ,వల్లంభట్ల వనజ( దత్తపది).,డా.భోగయ చంద్రశేఖర్ శర్మ (వర్ణన) ,గణపురం రాజేదర్ (ఆశువు )పేరంసంధ్యారాణి (న్యస్తాక్షరి)దుర్గి శ్రవణ్ కుమార్ శర్మ (ఛందోభాషణం) డాక్టర్ వెంకన్న గారి జ్యోతి (అప్రస్తుత ప్రసంగం) ఆత్మీయ అతిథులు గా బాసర మూడ నాగభూషణం విద్యాలయ ఉన్నత పాఠశాల క రెస్పాండెంట్ బాబురావు, వైస్ ప్రిన్సిపల్ సులోచన , ఆంధ్ర భాష కోవిదులు పరాంకుశమ్ ,రాజేశ్వర్ మరియు ,యాగ శాల నిర్మాణ సహాయకులు హైదరాబాద్ వాస్తవ్యులు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వికాస్ రెడ్డి డాక్టర్ ఆరాధన రెడ్డి దంపతులుపాల్గొననున్నారని వారు తెలిపారు. అలాగే ప్రతినెల మూడవ ఆదివారము ఉచితంగా అధ్యాత్మిక ధార్మిక సాంస్కృతిక విశేష కార్యక్రమములు నిర్వహించనున్నామని ఆసక్తిలవారు 99483 32032 సంప్రదించాలని నిర్వాహకులు ,వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాధశర్మ సంధ్య దంపతులు కోరారు.

# ఆర్కేపురంలో వరాహశ్రీ పూజా సామాగ్రి షోరూమ్ ఘన ప్రారంభం









కొత్తపేట, జూన్ 19, (నగర నిజం) : ఆర్‌కే పురం రోడ్ నంబర్--2లోని ప్రత్యంగర వారాహి దేవి ఆలయ కమాన్ రోడ్డులో వరాహ శ్రీ పూజా సామాగ్రి షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా చైతన్యపురి బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్, ఆర్‌కే పురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలక ఉపేందర్ రెడ్డి, బుగ్గారపు వరుణ్ గుప్తా, శ్రీనివాసు, సౌజన్యతో పాటు బంధుమిత్రులు, పార్టీ అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ వ్యాపార రంగంలో ముందుకు సాగుతున్న యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. భక్తులకు అవసరమైన పూజా సామాగ్రి ఒకే చోట అందుబాటులో ఉండటం సంతోషకరమని పేర్కొన్నారు.షోరూమ్ నిర్వాహకులు స్వర్ణ మంజుల, కిరణ్ మాట్లాడుతూ... తమ వద్ద అన్ని రకాల పూజా సామాగ్రి హోల్ సేల్ సరఫరా సౌకర్యంతో అందుబాటులో ఉంటుందని తెలిపారు. నాణ్యమైన పూజా వస్తువులను సరసమైన ధరలకు అందిస్తున్నామని, భక్తులు తప్పకుండా ఒకసారి షోరూమ్‌ను సందర్శించి సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగింది.





# పైడిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పుస్తకాలు పంపిణీ



కోరుట్ల జూన్ 19,(నగర నిజం) జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం పైడిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 8వ వార్డ్ మెంబర్ ఆకువత్తిని నిరంజన్ మాట్లాడుతూ.. నా వార్డు పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు.విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మరియు పాఠశాలకు మంచి పేరు తేవాలని 8వ వార్డ్ మెంబర్ ఆకువత్తిని నిరంజన్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సర్పంచ్ భూమేష్, ఉప సర్పంచ్ గాంధారి సుజాత శ్రీనివాస్, వార్డ్ మెంబర్ ఆకువతిని నిరంజన్, దొమ్మటి రాము గౌడ్, దుంపల భవాని కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల్ జూన్ 19, (నగర నిజం) వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. ఈరోజు స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్.. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించి వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు.విద్యార్థులలో చదువుపై ఆసక్తి పెంచేందుకు ఉపాధ్యాయులు బోధనలో ప్రత్యేక విధానాలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు సహాయం అందించాలని తెలిపారు.మొత్తం విద్యార్థుల్లో 100 శాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, గైర్హాజరు విద్యార్థుల వివరాలు సేకరించి తల్లిదండ్రులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయతకు చిరునామా ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్- మంత్రి అజారుద్దీన్

**శంషాబాద్ లో ప్రభుత్వ బీసీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు వి.హెచ్ కు పౌర సన్మానం నిర్వహించిన ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్**

**వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అజారుద్దీన్**

**వీ.హెచ్, మంత్రి అజారుద్దీన్ తో పాటు టీఎం.ఆర్.ఈ.ఇ.ఎస్ అధ్యక్షుడు మహమ్మద్ ఫహీం ఖురేషిలను ఘనంగా సన్మానించిన ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్**

**ఇరామ్ గార్డెన్ లో నిర్మించ తలపెట్టిన నూతన మసీదు ఈ సుప్పా కు శంకుస్థాపన చేసిన మంత్రి అజారుద్దీన్**









రాజేంద్రనగర్, జూన్ 19(నగరనిజం ప్రతినిధి)గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ కు చెందిన ప్రముఖ ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ సేవలు ఎనలేనివని మంత్రి అజారుద్దీన్ కొనియాడారు. ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ ఆత్మీయతకు మారుపేరు వంటి వారని అజారుద్దీన్ పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ కురువృద్ధుడు, ఆత్మీయ మిత్రుడైన వి హనుమంతరావు తెలంగాణ ప్రభుత్వ బీసీ సంక్షేమ అభివృద్ధి సలహాదారుగా నియమితులు కావడం అభినందనీయమన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ అభివృద్ధి సలహాదారుగా నియమితులైన కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు కు గురువారం రాత్రి గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ లో ప్రముఖ ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ పౌర సన్మానం నిర్వహించారు. ఈ వేడుకకు మంత్రి అజారుద్దీన్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా....టీఎం.ఆర్.ఈ.ఇ.ఎస్ అధ్యక్షుడు మహమ్మద్ ఫయుం ఖురేషి ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వి హనుమంతరావు తోపాటు మంత్రి అజారుద్దీన్, ఫయుం ఖురేషిలను ఘనంగా సన్మానించారు ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అజారుద్దీన్..... కాంగ్రెస్ పార్టీలో తలపండిన నేతగా ఎదిగిన వి హనుమంతరావు ను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ బీసీ సంక్షేమం, అభివృద్ధి సలహాదారుగా నియమించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. వి హనుమంతరావుతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని అజారుద్దీన్ గుర్తు చేసుకున్నారు. ఇందిరాగాంధీ కుటుంబానికి నమ్మిన బంటుగా ఎదిగిన వి హనుమంతరావు తన అనుభవంలో ఎన్నో పదవులు పొందారని అజారుద్దీన్ గుర్తు చేశారు. విహెచ్ సేవలను గుర్తించి ప్రభుత్వం సలహాదారుగా నియమించినందుకు మంత్రి అజారుద్దీన్ సంతోషం వ్యక్తం చేశారు.

### ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ నాకు పెద్దన్నలాంటివారు - మంత్రి అజారుద్దీన్

వి.హనుమంతరావుకు పౌర సన్మానం నిర్వహించిన ప్రముఖ ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ తనకు పెద్దన్నలాంటి వారని మంత్రి అజారుద్దీన్ పేర్కొన్నారు. ఆత్మీయతకు చిరునామాగా పేరొందిన ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ తనకు అన్నగా దొరకడం సంతోషంగా ఉందన్నారు. కుల మతాలకు పాటు రాజకీయాలకు అతీతంగా అందరినీ ఆత్మీయంగా చేరదీసే ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ శంషాబాద్ ప్రాంత వాసు కావడం ఇక్కడి ప్రజల అదృష్టమని ఆయన గుర్తు చేశారు.

### ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ పై వీహెచ్ ప్రశంసలు

తనకు పౌర సన్మానం నిర్వహించిన ప్రముఖ ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ కు వి హనుమంతరావు కృతజ్ఞతలు చెప్పారు. ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ తో తనకు విడదీయరాని అనుబంధం ఉందని వీహెచ్ గుర్తు చేసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా అందర్నీ ఆత్మీయంగా చేరదీసే ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ తనకు మంచి మిత్రుడు కావడం సంతోషంగా ఉందన్నారు.

### ఇరామ్ గార్డెన్ లో మసీదు నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి అజారుద్దీన్

ఈ సందర్భంగా శంషాబాద్ లోని ఇరామ్ గార్డెన్ వేదికగా ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ తలపెట్టిన నూతన మసీదు నిర్మాణం పనులకు మంత్రి అజారుద్దీన్ శంకుస్థాపన చేశారు. వి హనుమంతరావు తో పాటు మహమ్మద్ ఫయామ్ ఖురేషితో కలిసి మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి అజారుద్దీన్.... ఎన్నారై ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ దంపతులపై ప్రశంసల జల్లు కురిపించారు. తమ సొంత భూమిలో మైనార్టీ ప్రజల కోసం మసీదు నిర్మాణానికి ముందుకు వచ్చిన ఇఫ్తేకార్ అహ్మద్ షరీఫ్ ను అజారుద్దీన్ తోపాటు వీహెచ్, స్వయం ఖురేషి అభినందించారు. మసీదు నిర్మాణం పూర్తయితే మైనార్టీ సోదరులకు ఒక ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా వివిధ సామాజిక సేవా కార్యక్రమాల కోసం ఉపయోగపడుతుందని అజారుద్దీన్ పేర్కొన్నారు.

# ప్రతి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుదన్న తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



నగర నిజం తాండూర్ ప్రతినిధి జూన్ 19:ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని వికారాబాద్ జిల్లా తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆసుపత్రులలో చికిత్స పొందిన తాండూరు నియోజకవర్గ పరిధిలోని బషీరాబాద్, యాలాల, తాండూర్, కోట్ పల్లి, పెద్దేముల్ తదితర మండలాలకు చెందిన 94 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 33,00,000లు (ముప్పై మూడు లక్షల) విలువ గలసి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సి ఎం సహాయ నిధి ఆపదలో ఉన్నకుటుంబాలకు అండగా ఉంటుందని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్,మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు నాగరాజు, మల్లేశం, పలువురు కౌన్సిలర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసం వద్ద ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనుంజయ్ ఆధ్వర్యంలో రాహుల్ జన్మదిన వేడుకలు**

**కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**






రాజేంద్రనగర్, జూన్ 19(నగరనిజం ప్రతినిధి):పార్లమెంటులో కాంగ్రెస్ విపక్ష నేత, కాంగ్రెస్ యువ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసం వద్ద ఘనంగా జరిగాయి. శుక్రవారం నాడు మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనుంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాహుల్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు పార్టీ నేతలు కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కేక్ కట్ చేసి కాంగ్రెస్ శ్రేణులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..... రాహుల్ గాంధీ దేశ ప్రజల సంక్షేమంతో పాటు వారి హక్కుల కోసం అలుపెరుగని పోరాటం కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం తో పాటు దేశ అభివృద్ధి కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. రాహుల్ గాంధీకి దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ్, మాజీ కార్పొరేటర్ టి ప్రేమ్ దాస్ గౌడ్, పార్టీ నేతలు సరికొల్ల వెంకటేష్, సుధాకర్ గౌడ్, ఎస్ జైపాల్, భాషా, శ్రీనివాస్, బొల్లా వెంకటేష్, కాశి గారి యాదగిరి, లక్ష్మారెడ్డి, గట్టయ్య, ఓం ప్రకాష్, సిహెచ్ గోపాల్, ఎం. శ్రీనివాస్, అనంతం గౌడ్, మల్లేష్, అనిల్, పూల వెంకటేష్ ముదిరాజ్, అజయ్, శివ, శ్రీనివాస్, రత్నం, రాజు, జగదీష్, జగన్, కృష్ణ, కిరణ్, నరసింహ రాజు, యేసు, రాము, నరసింహ యాదవ్, రవీందర్ ముదిరాజ్, బండారి యాదగిరి, శివ, మహేష్, శ్రీశైలం, అనిల్, పెంటీ సుధాకర్, శరణమ్మ, లావణ్య, లలిత, పుష్ప, రాధారెడ్డి, నిర్మల, నీలం సునీత, అశ్విని తదితర పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.


# విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు.**



మెదక్ బ్యూరో : నగర నిజం :మెదక్ జిల్లా శుక్రవారం బడావత్ రాఘవేందర్, హవేళీఘనపూర్ మండలం పోచంరాల్ తండాకు చెందిన విద్యార్థి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బూరుగుపల్లిలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని, బీసీ హాస్టల్‌లో నివసిస్తూ విద్యను అభ్యసించాడు.పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించినందుకు, జిల్లా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ కాలేజెస్ పథకం ద్వారా హైదరాబాద్ బోడుప్పల్‌లోని ఎస్.ఆర్. జూనియర్ కళాశాలలో ఉచిత సీటు పొందాడు.ప్రభుత్వ సహకారంతో ఇంటర్మీడియట్ విద్యను విజయవంతంగా పూర్తి చేశాడు. తెలంగాణ ఈఏపీసెట్ పరీక్షలో సుమారు 2000 లోపు ర్యాంకు సాధించాడు.జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించి, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో కూడా మంచి ప్రతిభ కనబరిచాడు.ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ వారణాసి (దీఎఖ) లో కంప్యూటింగ్ అండ్ మ్యాథమెటిక్స్ బ్రాంచ్‌లో ప్రవేశం పొందాడు.ఈ సందర్భంగా విద్యార్థి నేడు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశాడు.కలెక్టర్ మారుమూల గ్రామం నుంచి ఐఐటీ వారణాసి వరకు అతని విద్యా ప్రస్థానాన్ని అభినందిస్తూ, ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం తరఫున అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.చదువును ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని, విద్య ఒక మనిషిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుందని విద్యార్థికి సూచించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఐ=ూ అంబాదాస్ రాజేశ్వర్ , జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు ఏఎస్ఓ నవీన్, జిల్లా అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి మురళీమోహన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బూరుగుపల్లి ప్రధానోపాధ్యాయులు రమేష్ మరియు రాఘవేందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా జీడిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం



**మెదక్ బ్యూరో : నగరనిజం :రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా జీడిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభంకార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తనుకుంట నర్సారెడ్డిగ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తుల సమక్షంలో ప్రారంభోత్సవంలబ్ధిదారురాలు లక్ష్మీ కు ఇందిరమ్మ ఇల్లు అందజేతమెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లబ్ధిదారురాలు లక్ష్మీ (భర్త లేటు రమేష్)కు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తనుకుంట నరసారెడ్డి, సిద్దిపేట జిల్లా డిసిసి అధ్యక్షురాలు అక్షరెడ్డి, గ్రామ సర్పంచ్ నరసుగారి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు రాగం శ్రీనివాస్, రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు పెంటా గౌడ్, మెదక్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కళ్యాణ్, మండల కాంగ్రెస్ నాయకులు పురం రవి, మాజీ సర్పంచ్ నగేష్ బాబు, కుచారం మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ గౌడ్ గ్రామ ఈవో సత్యనారాయణ, ఉపసర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.అలాగే జీడిపల్లి గ్రామ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.**

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణుల సందడి

**తూప్రాన్‌లో కేక్ కటింగ్.. జీడిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకత్వం**

**రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు**

**తూప్రాన్‌లో కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**

**జీడిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు**

**ప్రజాస్వామ్య పరిరక్షణకు రాహుల్ గాంధీ కృషి ఆదర్శమని ఆంక్ష రెడ్డి వ్యాఖ్య**

**భారీగా హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు**



మెదక్ బ్యూరో : నగర నిజం : తూప్రాన్, జూన్ 19: భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తూప్రాన్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, దేశ ప్రజల సంక్షేమం, యువత అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్న నాయకుడని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, పేదల సంక్షేమం, రైతుల సమస్యల పరిష్కారంలో ఆయన చేస్తున్న కృషి దేశానికి ఆదర్శమని కొనియాడారు.అనంతరం తూప్రాన్‌లో జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాహుల్ గాంధీ దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఇస్నాపూర్ మున్సిపల్ సమావేశంలో నిరసనల సెగ

**అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యంపై కౌన్సిలర్ల ఆగ్రహం**

**విద్యుత్ శాఖ అధికారుల గైర్హాజరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక**

**స్థానికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి: కౌన్సిలర్ల డిమాండ్**

**శిశు విక్రయాల ఘటనపై చైర్‌పర్సన్ సుమలత సీరియస్**








నగర నిజం, పటాన్‌చెరు:సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం శుక్రవారం రసాభాసగా మారింది. అభివృద్ధి పనుల నుండి ప్రజా సమస్యల వరకు పలు అంశాలపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. చైర్‌పర్సన్ మోటే సుమలత శ్రీకాంత్, కమిషనర్ వెంకట కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.సర్వ సభ సమావేశానికి విద్యుత్ శాఖ ఏఈ (రాజు) హాజరుకాకపోవడంపై కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నా, ఏ ఒక్క సందర్భంలోనూ బాధ్యతాయుతంగా స్పందించడం లేదని వారు మండిపడ్డారు.అత్యవసరమైన సమావేశానికే రాకపోతే, ఇక సామాన్యుల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్లు హెచ్చరించారు.మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిలర్లు ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే అక్రమ కట్టడాలు పెరుగుతున్నాయని విమర్శించారు. తమకు కనీస మర్యాద కూడా దక్కడం లేదని, బిల్ కలెక్టర్ల కంటే హీనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రుద్రారం వార్డు పరిధిలోని తోషిబా, ఎంఎస్ఎన్ వంటి పరిశ్రమల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్న స్థానిక కార్మికులకు ఉద్యోగ భద్రత (పర్మినెంట్) కల్పించేలా యాజమాన్యాలతో చర్చలు జరపాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్థానికులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని స్పష్టం చేశారు.ఇటీవల రుద్రారం వార్డులో జరిగిన శిశు విక్రయాల ఉదంతంపై చైర్‌పర్సన్ మోటే సుమలత శ్రీకాంత్ స్పందిస్తూ.. ఇది మున్సిపాలిటీకి మాయని మచ్చ అని పేర్కొన్నారు. ఇంటి యజమానులు అద్దెదారుల వివరాలు, ఆధార్ కార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఇళ్లను అద్దెకు ఇవ్వాలని సూచించారు.యజమానుల నిర్లక్ష్యం వల్లే నేరస్తులకు ఆశ్రయం దొరుకుతోందని హెచ్చరించారు. వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తు కోసం కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్ఐపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

# టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్




ఇబ్రహీంపట్నం, జూన్ 19 ( నగరనిజం ) : రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ లో ఆర్ఐ అధికారిపై ఓ మహిళ దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని టిఎన్జీవో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ... తుర్కయంజాల్ సర్వే నెంబర్ 338 లో 1810 వివాదం గల భూవిషయంలో పై అధికారుల ఆదేశాల మేరకు భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని వెళ్ళగా అక్కడ ఉన్న మహిళ ఆర్ఐ, జిపిఓ ను గల్లా పట్టుకొని ఈడ్చి కెల్లటాని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడడం కోసం వెళితే ఇలాంటి దారుణాలు జరగడం దురదృష్టకరమని తెలిపారు. వెంటనే బాధ్యులైన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై గుండాయిజం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనల పట్ల విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంటుందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్ఐ ప్రేమ్ కుమార్, జిపిఓ హనుమంతుకు న్యాయం జరిగే వరకూ టీఎన్జీవో సంఘం అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**






నగర నిజం జూన్ 19 సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ పరిధి రామచంద్రపురం లోని భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లాపూర్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల సంఘం తెల్లాపూర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని.. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ రంగ కార్మికుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం కోసం అతి త్వరలో స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ తగు ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ తరపున ప్రతి కార్మికుడు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, శ్రీశైలం, దయాకర్, శ్రీ పాల్ రెడ్డి, నాగరాజు, సాగర్, హర్ష, ఇంద్రారెడ్డి, సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో ప్రభుత్వ భూమి స్వాధీనం.. ఆలయం యథాతథం హైడ్రా కసరత్తు






నగర నిజం పటాన్‌చెరు, జూన్ 19: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా, తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు చెందిన 1599 గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకునే ప్రక్రియను హైడ్రా అధికారులు వేగవంతం చేశారు.ఆలయానికి ఇబ్బంది లేకుండా..ప్రస్తుతం సదరు స్థలంలో కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో, ఆలయానికి ఎటువంటి ఆటంకం కలగకుండా, ఆ స్థలాన్ని రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయాన్ని యథాతథంగా ఉంచి, మిగిలిన భూమిని ఆక్రమణల నుండి కాపాడేలా చుట్టూ రక్షణ కంచెను ఏర్పాటు చేస్తున్నారు.ఈ ఆలయ నిర్మాణాన్ని స్థానిక ఎమ్మెల్యే తన సొంత నిధులతో చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే, గురువారం ఉదయం ఆయన ఆలయ గుమ్మానికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. దేవాలయ పవిత్రతకు భంగం కలగకుండా, ప్రభుత్వ భూమిని పరిరక్షించడమే లక్ష్యంగా అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ప్రస్తుతం ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# శంషాబాద్ ప్లై ఓవర్ కింద గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

**లిమ్స్ హాస్పిటల్ సమీపంలో ఘటన**

**మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన ఆర్.జి.ఐ.ఏ పోలీసులు**



రాజేంద్రనగర్, జూన్ 19(నగరనిజం ప్రతినిధి) శంషాబాద్ ప్లై ఓవర్ కింద ఓ గుర్తు తెలియని వ్యక్తి (వృద్ధుడి) మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు ఆర్.జి.ఐ.ఏ పోలీసులు. శంషాబాద్ లిమ్స్ హాస్పిటల్ సమీపంలో ఈ ఘటన శుక్రవారం నాడు చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు... మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీసుల కథనం ప్రకారం ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ లిమ్స్ హాస్పిటల్ ఎదురుగా ప్లై ఓవర్ కింద ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలాన్ని సందర్శించిన శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీస్ స్టేషన్ పోలీసులు.... మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయసు 60 –65 సంవత్సరాలు ఉంటుందని, బిక్షాటకుడై ఉంటాడని భావిస్తున్నట్లు ఆర్.జి.ఐ.ఏ పోలీసులు ప్రకటించారు. మృతుడి కుడికాలు విరిగిపోయి ఉండడం బట్టి చూస్తే అనారోగ్యంతో మృతి చెందినట్లు గా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మాని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడికి సంబంధించి ఎవరైనా బంధువులు ఉంటే వెంటనే శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీస్ స్టేషన్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజీవ మొబైల్ నెంబర్ 8712663310 లేదా స్టేషన్ ఏఎస్ఐ మొబైల్ నెంబర్ 8712567977, పోలీస్ స్టేషన్ నెంబర్ 8712663319 కు ఫోన్ చేసి సంప్రదించాలని సీఐ సంజీవ సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటించారు.


# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించిన అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్



నగర నిజం అమీన్‌పూర్, జూన్ 19: భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని అన్నారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ, దేశ ప్రజల సమస్యలను పార్లమెంట్‌లోనూ, ప్రజాక్షేత్రంలోనూ ప్రస్తావిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం, రైతులు, యువత, మహిళలు, పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని, రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో ప్రజాస్వామ్య విలువలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు.జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ష కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీరంగూడ దేవాలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ నాయకులు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నాగోల్‌లో తెలంగాణ మహిళా జన సమితి కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభం

**సత్తూరి పుష్పనీల గౌడ్ చేతుల మీదుగా ప్రారంభం -- ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు కార్యాలయ సేవలు**





ఎల్బీనగర్, జూన్ 19 (నగర నిజం): తెలంగాణ మహిళా జన సమితి కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్తూరి పుష్పనీల గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సంక్షేమం, సాధికారత కోసం సమితి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యాలయానికి వచ్చే మహిళలు, కార్యకర్తలు మరియు ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు కార్యాలయం ప్రతిరోజూ ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. మహిళల సమస్యల పరిష్కారం, అవగాహన కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో తెలంగాణ మహిళా జన సమితి కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# నేరాల నివారణ గుర్తింపులో అప్రమత్తంగా ఉండాలి

**ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి**
**ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ**





ఇబ్రహీంపట్నం, జూన్ 19 ( నగరనిజం ) : నేరాల నివారణకు నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి, ఐపీఎస్ శుక్రవారం గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిపాలన మరియు విధుల నిర్వహణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, ప్రజల ఫిర్యాదుల పరిష్కార విధానం, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ చర్యలు, స్టేషన్ పరిపాలనా వ్యవస్థ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై వారి విధి నిర్వహణను అభినందిస్తూ, మరింత సమర్థవంతంగా సేవలందించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, బాధ్యతాయుతమైన మరియు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడం ప్రతి పోలీసు అధికారి కర్తవ్యమని కమిషనర్ పేర్కొన్నారు. ఫిర్యాదులను సత్వరమే నమోదు చేసి పరిష్కరించడం, కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడం, నేరాల నివారణ మరియు గుర్తింపులో అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, సమర్థవంతంగా పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తిపరమైన ప్రమాణాలను పాటించాలన్నారు. బీట్ పోలీసింగ్ మరియు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలన్నారు. నేరాల నివారణకు నిఘా వ్యవస్థను పటిష్టం చేసి, ముందస్తు చర్యలు చేపట్టాన్నారు. స్టేషన్ రికార్డులు, డాక్యుమెంటేషన్ మరియు పరిపాలనా వ్యవస్థను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందిస్తూ, అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించాలన్నారు. తనిఖీ కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం డివిజన్ ఏసీపీ కెపివి.రాజు, పాల్గొని, పోలీస్ కమిషనర్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ తనిఖీ ద్వారా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన మరియు ప్రజా కేంద్రిత పోలీసింగ్ సేవలను అందించాలనే తన నిబద్ధతను మరోసారి చాటిచెప్పింది. సీపీ వెంట ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్

**గాంధీ భవన్‌లో కేక్ కటింగ్, రక్తదాన శిబిరం నిర్వహణ**





హైదరాబాద్, జూన్ 19 (నగర నిజం): భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో "తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్" ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాదళ్ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. "మిద్దెల జితేందర్" మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటం, సామాజిక న్యాయం, యువత ఉపాధి, రైతుల సంక్షేమం, మహిళా సాధికారత మరియు వెనుకబడిన వర్గాల హక్కుల కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని అన్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలను తెలుసుకుని వారి గొంతుకగా నిలిచారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని గాంధీ భవన్‌లో టీపీసీసీ మెడికల్ అండ్ డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ అధ్యక్షతన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా "తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా సేవాదళ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి శకుంతల రెడ్డి," "మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నాయకురాలు కంతి రేణుక" రక్తదానం చేశారు. రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సేవాదళ్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, మహిళా సేవాదళ్ ప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాగోల్‌లో బీజేపీ బిఎల్ఏ-2లకు ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమం

**ఓటరు జాబితా సవరణ, అర్హుల నమోదు లక్ష్యంగా ప్రత్యేక అవగాహన**







ద

ఎల్బీనగర్, జూన్ 19 (నగర నిజం):బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో ఎల్‌బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బిఎల్ఏ-2 ల కోసం ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, అర్హులైన ప్రతి ఓటరును ఓటరు జాబితాలో చేర్చడం, ఓటరు వివరాల్లోని తప్పులను సరిదిద్దడం, అనర్హుల పేర్లను తొలగించడం, అలాగే బిఎల్ఏ-2 లకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్ఐఆర్ రాష్ట్ర కన్వీనర్ అశోక్ వేముల, మాజీ మంత్రి, ఎస్ఐఆర్ రాష్ట్ర కోఆర్డినేటర్ మర్రి శశిధర్ రెడ్డి, సీనియర్ నాయకులు పేరాల శేఖర్, పొన్న వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రంగారెడ్డి అర్బన్ జిల్లా ఎస్ఐఆర్ కన్వీనర్ గుర్రం చెన్నకేశవ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ ఆలే భాస్కర్, మేడ్చల్ జిల్లా ప్రభారి సామ రంగారెడ్డి, ఎల్‌బీ నగర్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శులు భండారి భాస్కర్, యశ్‌పాల్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భండారి శైలజ, శ్రీదేవి రెడ్డి, బీజేపి రాష్ట్ర ఓబీసీ మోర్చా ఐటీ కన్వీనర్ లక్ష్మీదేవి, బిజెపి మహిళా చాడ అనితారెడ్డి, నందికొండ గీతారెడ్డి, పో రెడ్డి కవిత రెడ్డి, మాజీ జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి, కార్పొరేటర్లు, జిల్లా కార్యదర్శులు నరేష్ యాదవ్, నూతి శ్రీనివాస్ రావు, సీనియర్ నాయకులు, మహిళా మోర్చా, యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్



యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ 19 (నగర నిజం): , భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్ లభించినట్లు విశ్వవిద్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు బుధవారం వెల్లడించారు. "అపారటస్ ఫర్ కంట్రోల్డ్ మిక్సింగ్ ఆఫ్ కాంక్రీట్ అట్ కన్స్ట్రక్షన్ సైట్స్" అనే అంశంపై విశ్వవిద్యాలయానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరిశేఖర్ మిట్ట చేసిన పరిశోధనకుగానూ భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం పేటెంట్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక పేటెంట్ సాధించిన పరిశోధక బృందంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ హరిశేఖర్ ఏకైక ప్రతినిధిగా, సహ-రచయితగా వ్యవహరించి ఈ ఘనత సాధించారని పేర్కొన్నారు. సహపరిశోధకులుగా డాక్టర్ శ్రీకాంత్ సర్జెరావ్ బొబాడే, డాక్టర్ సువందన్ సరస్వత్, డాక్టర్ ప్రియాంక సింగ్, డాక్టర్ దివ్య చంద్ర, మిస్టర్ నితిన్ కుమార్ చౌహాన్, డాక్టర్ రుచి సరస్వత్, మిస్టర్ వికాస్ కుమార్ సింగ్లా, మిస్టర్ నీరజ్ వర్మ, డాక్టర్ మొహమ్మద్ మజిద్ ఉన్నారని వివరించారు.ఈ సందర్భంగా డాక్టర్ హరిశేఖర్ మిట్ట మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ జాతీయ పేటెంట్ లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ పరిశోధనలో భాగంగా నిర్మాణ స్థలాలలో కాంక్రీట్ మిశ్రమాన్ని ఖచ్చితమైన ప్రమాణాలతో నియంత్రించే పరికరాన్ని రూపొందించినట్లు చెప్పారు. ఈ సుదీర్ఘ పరిశోధనా ప్రయాణంలో తనకు అన్ని వేళలా సహకరించి, ప్రోత్సహించిన విజ్ఞాన్స్ విశ్వవిద్యాలయ యాజమాన్యానికి, తోటి అధ్యాపకులకు మరియు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జాతీయ స్థాయి పేటెంట్ సాధించి విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలను పెంచిన డాక్టర్ హరిశేఖర్ మిట్టను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిశోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.